ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో కొత్త డ్యూయల్ డిగ్రీ కోర్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో కొత్త కోర్సును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇది కొత్త డ్యూయల్ డిగ్రీ కోర్సుగా దీన్ని ప్రారంభిస్తారు. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్(ఆనర్స్), ఎంఎస్ పరిశోధన ద్వారా జియోస్పేషియల్ టెక్నాలజీలో(సీజీడీ) అయిదు సంవత్సరాల కోర్సును ప్రారంభిస్తారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి దాని ట్రాన్స్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ కోర్సుకు జియోస్పేషియల్ టెక్నాలజీలో కొత్త కోర్సును ప్రారంభిస్తోంది. ఈ కోర్సులో సీఎస్‌లో బీటెక్(ఆనర్స్), పరిశోధన డొమైన్ ప్రాంతాలలో మాస్టర్ ఆఫ్ సైన్స్‌ని మిళితం చేస్తాయి. ఈ సీజీడీ ప్రోగ్రామ్‌కి అడ్మిషన్లు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ అండర్ గ్రాడ్యుయేట్ ఎంటర్ ఎగ్జామినేషన్ (యూజీఈఈ) ద్వారా ఉంటాయి. జూన్–2024 నాటికి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో 12వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

సందడి చేసిన చిన్నారులు



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. సీతా, రామ లక్ష్మణులుగా విద్యార్థులు వేషధారణతో ఆకట్టుకున్నారు. భారతీయ ఇతిహాసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో కార్పొరేటర్ పూజిత గౌడ్ గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే



రాయదుర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: ప్రజలకు అండగా ఉండేది రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా హస్తం గుర్తుకు ఓటేయండి, కాంగ్రెస్ పార్టీని గెలిపించండి అని ఆయన కోరారు. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డికి శేరిలింగంపల్లి ప్రజలంతా సంపూర్ణ మద్దతుగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అడ్డదారిన వెళ్తున్న ద్విచక్రవాహనాదారులపై కేసు

మియాపూర్: ప్రధాన రహదారిపై అడ్డదారిగా వస్తున్న పదిమంది ద్విచక్రవాహనాదారులపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం రోడ్డులో మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మియాపూర్ బొల్లారం రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలోని యూటర్న్ వద్ద జేపీనగర్ వైపు అడ్డదారిలో వెళ్తున్న పదిమంది ద్విచక్రవాహనాదారులను అదుపులోకి తీసుకుని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు మియాపూర్ ట్రాఫిక్ సిఐ ప్రశాంత్ తెలిపారు.

మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌ను కలిసిన రవి కుమార్‌యాదవ్



గచ్చిబౌలి: మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జి ఎం.రవి కుమార్ యాదవ్ కలిశారు. రఘునందన్ రావు గురువారం మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ర్యాలీలో పాల్గొన్నా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, నాయకులు ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో సింధుఆదర్శ్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వేసవిలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాణియదవ్, నాగమణి, నస్రీన్, సునిత, అరుణజ్యోతి, సత్యనారాయణ, సంపత్‌గౌడ్, పాషా, రాధాకృష్ణ పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని సాయినగర్‌లో..



మాదాపూర్‌లో..



మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో..



అస్తవ్యస్తంగా కేబుల్‌వైర్లు

కేబుల్ వైర్లతో స్తంభాలన్నీ ప్రమాదకరంగా మారాయి. మాదాపూర్ ఐటీ ప్రాంతం కావడంతో ఇంటర్నెట్ కనెక్షన్‌లు ఎక్కువగా తీసుకుంటున్నారు. కేబుల్ నిర్వాహకులు సరైన ప్రణాళిక లేకుండా కేబుల్ వైర్లకు ప్రత్యేకంగా స్తంభాలను వేయకుండా కరెంట్ స్తంభాలకే ఎక్కడ పడితే అక్కడ వైర్లను కట్టేస్తున్నారు. దీంతో కరెంట్‌వైర్లకు, కేబుల్ వైర్లకు తేడా లేకుండా ప్రమాదకరంగా మారుతున్నాయి. సమస్యలు తలెత్తినప్పుడు మరమత్తులు చేసేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్‌లోని సాయినగర్, చంద్రానాయక్‌తాండ, గఫూర్‌నగర్, అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాలలో కేబుల్ వైర్లను కరెంట్ స్తంభాలకు కడుతున్నారు. –మాదాపూర్

వారసత్వ ప్రదేశాలపై డాక్యుమెంటేషన్‌కు ప్రతిపాదనలు ఆహ్వానం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఈపీటీఆర్‌ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: తెలంగాణ వారసత్వ ప్రదేశాలపై డాక్యుమెంటేషన్ కోసం ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఈపీటీఆర్‌ఐ డీజీ వాణి ప్రసాద్ తెలిపారు. గురువారం వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకొని రాష్ట్ర అదనపు కార్యదర్శి ప్రశాంతితో కలిసి ఆమె వరల్డ్ హెరిటేజ్ డే పోస్టర్‌ను విడుదల చేశారు. తెలంగాణ వారసత్వ సంపదపై డాక్యుమెంటేషన్ చేయాలనుకునే వారు మే 15 లోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సంస్కృతి, సహజ సంపదలను డాక్యుమెంటేషన్ చేయడం కోసం విశ్వవిద్యాలయాలు, రిసెర్చ్ స్కాలర్స్, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొనాలను ఆమె సూచించారు.

మహిళలు, యువతకు సాధికారత కల్పనే లక్ష్యం

ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుజ్ఞాన్ వెంకటేష్

రాయదుర్గం: అట్టడుగు వర్గాల మహిళలు, యువతకు సాధికారత కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నా మని ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుజ్ఞాన్ వెంకటేష్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఏడీపీ కార్యాలయంలో గురువారం సీఎస్‌ఆర్ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 180 మంది మహిళలు, యువత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పించే దిశగా వారి ప్రయాణంలో ఒక మైలురాయిని సూచించేలా చేయాలనే తపనతో ముందుకుసాగుతున్నామన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న సుజ్ఞాన్ వెంకటేష్

ఏడీపీ ప్రారంభించి నప్పటి నుంచి ఇప్పటి వరకు 3,300 మంది మహిళలకు మద్దతు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.

వాలీబాల్ విజేత టీమ్ వైపర్స్



సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీలో జరిగిన ఫ్రెండ్స్ వాలీబాల్ టోర్నమెంట్ సీజన్–3 విజేతగా టీమ్ వైపర్స్ నిలిచింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో టీమ్ వైపర్స్ జట్టు సమీప ప్రత్యర్థి అయిన స్పైక్ ప్యాంథర్స్ జట్టుపై 21–19, 20–21, 21–13 తేడాతో గెలిచింది. ఏప్రిల్ 6న ఆరంభమైన 3వ సీజన్లో.. మొత్తం 48 మంది క్రీడాకారులు ఆరు జట్లుగా పోటీపడ్డారు. మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా చంద్రమోహన్ నిలిచారు. రూబెన్, దేబ్జీత్, వంశీలు సెమీఫైనల్స్, ఫైనల్స్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచారు. ఎస్‌ఎంఆర్ వినయ్ సిటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కింగ్ జాన్సన్ కొయ్యడ విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ టోర్నమెంట్‌కు స్పాన్సర్స్‌గా నిలిచిన కొణిదెల అరుణ్, ఏవీఎస్, ముత్తు ఎస్, దేబ్జీత్ నేగీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ మహేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. వట్టినాగల పల్లి– ఉస్మాన్‌నగర్ శివారులో గురువారం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా 40 నుంచి 50 ఏళ్ళ వయస్సు కలిగి ఉండే మహిళ మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఇరు వర్గాలపై కేసులు నమోదు
- పోలీస్ పికెట్ ఏర్పాటు

గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. బుధవారం అర్ధరాత్రి తర్వాత రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఇరు వర్గాలకు చెందిన బాలకృష్ణ, హఫీజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. క్యాంపస్‌లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పారిశ్రామిక వేత్తలతో ఎస్పీ రూపేష్ సమీక్ష

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, అక్కడ తయారవుతున్న ఉత్పత్తులు, తదితర విషయాలు ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రూపేష్ సూచించారు. గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల ప్రతినిధులతో రెండో 'సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్' సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిశ్రమల రక్షణ, మహిళల భద్రత, రవాణా, ట్రాఫిక్ రద్దీ నివారణ, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, సైబర్ నేరాల నివారణ తదితర విషయాలపై ఎస్పీ రూపేష్ డిజిటల్ డిస్ప్లేల ద్వారా పరిశ్రమల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించేలా యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమలతో పాటు కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసినప్పుడు సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సంజీవరావు, ఎస్‌ఎస్‌ఎస్‌సీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, సీఐలు సుధీర్‌కుమార్, గంగాధర్‌లతో పాటు పోలీసు సిబ్బంది, ఆయా పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

ఇష్టానుసారంగా మట్టి డంపింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణాల కోసం తవ్వగా వచ్చిన మట్టిని, రాళ్లను భవన నిర్మాణదారులు మట్టిని టిప్పర్లతో తరలిస్తూ రోడ్లపై డంపింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాదారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.



శాసనానికి సాక్ష్యం.. తెలంగాణపురం

- పూర్వచరిత్ర ద్వారా ఆధారాలు లభ్యం
- తెల్లాపూర్ పేరును తెలంగాణపురంగా మార్చాలని స్థానిక ప్రజల డిమాండ్
- తెరపైకి మళ్లీ తెలంగాణపురం పేరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌కు ఘన చరిత్ర ఉంది. కానీ.. దాన్ని వెలుగులో తీసుకురావడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. పూర్వం తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పిలిచేవారని చరిత్ర చెబుతోంది. అందుకు సాక్ష్యంగా శాసనం కూడా ఉంది. తెలంగాణ ఉద్యమం సమయంలో సైతం బీఆర్‌ఎస్ నేతలు ఆ శాసనాన్ని సందర్శించి తెలంగాణ వచ్చిన వెంటనే తెల్లాపూర్ పేరును తెలంగాణపురంగా మారుస్తామని హామీలు సైతం ఇచ్చారు. కానీ.. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా పేరు మాత్రం మారడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్యుత్‌నగర్‌కాలనీకు వచ్చిన మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలంగాణపురం విషయాన్ని తిరిగి తెరపైకి తీసుకొచ్చారు. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయంగా మారింది. శాసనం ద్వారా లభించిన ఆధారాలతో దరితెల్లాపూర్‌ను తెలంగాణపురంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


సాక్ష్యం చెబుతున్న శాసనం

నాటి కాలం నుంచి తెల్లాపూర్‌లో రెండు రాతి స్తంభాల మధ్యన పురాతన శాసనం ఉంది. అందులో ఇలా రాసి ఉంది. శక సంవత్సరం 1340 హేవళంబి సంవత్సరం, మాఘమాసం, గురువారం రోజున ప్రతిష్ఠించిన్నట్లు శిలాశాసనంపై ఆధారాలు ఉన్నాయి. మన కాలమాన ప్రకారం 1417–1418గా చెప్పవచ్చును. విశ్వకర్మలలో ప్రముఖుడైన రుద్రోజు సిరిగిరోజు దీనిని రాయించినట్లు ఆ శాసనంలో ఉంది. దిగుడు బావి సమీపంలో మామిడి తోపు అని శాసనంపై రాసి ఉంది. అదేవిధంగా బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా తన భార్యతో కలసి పానగల్లు కోటకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తెలంగాణపురం (ప్రస్తుత తెల్లాపూర్)లోని మామిడి తోటలో విడిది చేసినట్లు, విశ్వకర్మ శిల్పులు బంగారు బహుమతులు అందజేసినట్టు శాసనంలో రాసి ఉంది.



తెల్లాపూర్‌లోని శాసనం

పేరు మార్చండి



చరిత్ర ఆధారంగా తెల్లాపూర్‌ను పూర్వం తెలంగాణపురంగా పిలిచేవారు. అందుకు సాక్ష్యం తెల్లాపూర్‌లో ఉన్న నాటి శాసనమే. తెలంగాణ వచ్చిన వెంటనే తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మారుస్తామని నాటి నేతలు ఇచ్చిన హామీని మరిచారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తెల్లాపూర్‌ను తెలంగాణపురం అని పేరు మార్చి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

– కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్

తీర్మానం చేశాం



రాష్ట్రం ఏర్పడిన తర్వాత సర్పంచ్‌గా గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశంలో తెల్లాపూర్‌ను తెలంగాణపురంగా పేరు మార్చాలని తీర్మానం చేశాం. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ అంశం ప్రస్తావన రావడంతో అప్పటి నాయకులు శాసనంను సందర్శించారు. కానీ.. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణపురంగా పేరు మార్చాలని ప్రభుత్వానికి నివేదిక కూడా పంపించాం.

– సోమిరెడ్డి, మాజీ సర్పంచ్

నీటి సమస్యలను నివారించండి



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా, ట్యాంకర్ల సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడటంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీమన్నారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు నీటి సరఫరా లో ప్రెషర్‌తో జరుగుతుందని, ఏ మాత్రం సరిపోవటం లేదని, ట్యాంకర్లు బుక్ చేసిన రెండు రోజుల తర్వాత సరఫరా అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి ప్రస్తుతం మంజీరా నుంచి వస్తున్న 8 ఎంజీడీల నీటితో పాటు గండిపేట నీటిని 3 ఎంజీడీ స్థానికంగానే శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామన్నారు. చాలా అపార్ట్‌మెంట్‌లలో బోర్లు వట్టిపోవటంతో ట్యాంకర్ల బుకింగ్ పెరిగిపోయిందని, అందుకు అనుగుణంగా సరఫరాకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. మరో మూడు రోజుల్లో బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ వద్ద ఫిల్టర్ నుంచి మరో రెండు ఎంజీడీ నీరు అందుబాటులోకి వస్తుందని, అది వస్తే మరింత వెసలుబాటు కలుగుతుందన్నారు. కొత్తగా పుప్పాలగూడ ఎల్‌ఐసీ కాలనీలో త్వరలో మరో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎక్కడ ఎలాంటి నీటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే చేవెళ్ల అభివృద్ధి: కొండా విశ్వేశ్వర్ రెడ్డి



రాజేంద్రనగర్: భారత దేశం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం తెలంగాణ జాగృతి అసెంబ్లీ కన్వీనర్ కొండా పరమేశ్ గౌడ్ తన అనుచరులు 50 మందితో కలిసి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో ఆయన కార్యాలయంలో బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు దేవేందర్, కౌన్సిలర్ కొండా ప్రవీన్ గౌడ్, పత్తి శ్రీనివాస్, భీమార్జున రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డె నరసింహ, మల్లేష్ కురుమ, సిద్దులు కురుమ, సురేందర్‌తో పాటు నూతనంగా చేరిన చంటి, కొండా సృజన్ గౌడ్, రాజు, ప్రసాద్, జయరాం, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జీఎంఆర్ విమానాశ్రయానికి మరో అంతర్జాతీయ అవార్డు



శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయానికి మరో అంతర్జాతీయ అవార్డు దక్కింది. జర్మనీకి చెదిన స్కైట్రాక్ సంస్థ 'ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2024 బెస్ట్ ఎయిర్ పోర్టు దక్షిణాసియా' కింద ఈ అవార్డును జర్మనీలో బుధవారం రాత్రి అందజేసినట్లు జీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఉద్యోగులు, సిబ్బంది వందశాతం కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణికులకు సాంకేతికంగా సులభతరమైన ప్రయాణ అనుభూతులను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతలో కూడా విమానాశ్రం అగ్రభాగాన ఉందన్నారు. అవార్డు రావడం విమానాశ్రయ ఉద్యోగ, సిబ్బందికి ప్రోత్సాహకంగా మారిందన్నారు.